క్లుప్తంగా

మొక్కజొన్నపై పందుల దాడి



నేలవాలిన మొక్కజొన్న

కుంటాల: మండలకేంద్రం శివారులో సాగు చేసిన మొక్కజొన్న పంటలపై మంగళవారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. పంగెర సంతోష్, గోడపురం గజేందర్ అనే రైతుల మొక్కజొన్న చేన్లను అడవిపందులు ధ్వంసం చేయగా చెరో అర ఎకరం చొప్పున నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నా రు.

వనరులు పెంచుకోవాలి

కుంటాల: గ్రామపంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని ఎంపీడీవో లింబాద్రి సూచించారు. బుధవారం మండలంలోని అంబకంటి తండాలో నర్సరీ, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. వర్మి కంపోస్ట్ తయారీ విధానం పర్యవేక్షించి.. తయారు చేసిన ఎరువును రైతులకు అందించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సతీశ్ ఉన్నారు.

బీజేపీ అధ్యక్షుడికి సన్మానం

కడెం: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రితేశ్ రాథోడ్‌ను బుధవారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు శాలువాతో సత్కారించారు. ఇందులో బీజేపీ ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ మహేందర్, మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, సత్తన్న, రవీందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, తిరుమల్, కృష్ణ, ధీరజ్, శ్రీరాం, రంజిత్ తదితరులున్నారు.

పర్యావరణంపై అవగాహన

మామడ: పర్యావరణంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మామడ అటవీ క్షేత్ర అధికారి అవినాష్ అన్నారు. బుధవారం మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థులకు ఎక్స్‌పర్ట్ టాక్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతోనే జీవుల మనుగడ సాధ్యమన్నారు. అటవీ చట్టాలను తెలుసుకుంటూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలని అన్నారు. హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఎఫ్ఎస్ఓ ప్రభాకర్, ఎఫ్‌బీఓ రమేశ్ ఉన్నారు.

పరీక్షప్యాడ్లు పంపిణీ

భైంసాటౌన్: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి.. ప్రశాంతంగా చదువుకోవాలని ప్రజా ట్రస్ట్ చైర్మన్ బి.మోహన్‌రావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్, జెడ్పీ బాలికల పాఠశాల, సర్వేశ్వర్ విద్యామందిర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఉన్నతవిద్య కోసం ఆర్థిక ఇబ్బంది ఉంటే ప్రజాట్రస్ట్‌ను సంప్రదించాలని కోరారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు తదితరులున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కుంటాల: గ్రామాల్లో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంతోపాటు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

చోరీ సామగ్రి అప్పగింత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల మూడు కంప్యూటర్లు చోరీ అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా నిందితులు చోరీ చేసిన మూడు రోజుల అనంతరం కంప్యూటర్లను గ్రామ శివారులో వదిలి వెళ్లిపోయారు. ఈ కంప్యూటర్ల విషయమై న్యాయవాది బాశెట్టి శివ కేసు పూర్వపరాలను కోర్టులో వివరించారు. విచారణ అనంతరం పోలీసులు స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లను ఖానాపూర్ కోర్టు మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఆదేశాల మేరకు పాఠశాల హెచ్ఎం నరేందర్‌రావుకు తిరిగి అప్పగించారు.

'నిరుద్యోగుల గొంతుకనవుతా'



మాట్లాడుతున్న హరికృష్ణ

నిర్మల్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో నిరుద్యోగుల గొంతుకనై సమస్యలపై పోరాడతానని బీఎస్పీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. నిరుద్యోగి కష్టాలు తెలిసిన వాడినని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాసరలో ఛత్రపతి శివాజీ కమిటీ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు





భైంసారూరల్: మహాగాంలో శివాజీ విగ్రహం వద్ద..



సోన్: న్యూవెల్మల్‌లో శివాజీ విగ్రహానికి తిలకం దిద్దుతున్న రాజేశ్వర్

శివాజీకి ఘన నివాళి

జిల్లావ్యాప్తంగా బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆరె మరాఠా సంఘం, హిందూవాహిని మహిషశాఖ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ శివాజీ చూపిన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. - సాక్షి నెట్‌వర్క్



సారంగాపూర్: జామ్‌లో శివాజీ విగ్రహం వద్ద గ్రామస్తులు



లక్ష్మణచాంద: రాచాపూర్‌లో..



మామడ: కమల్‌కోట్‌లో శివాజీ విగ్రహం వద్ద..



ముధోల్‌లో ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో గుర్రం విన్యాసం



కుభీర్‌లో ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో..



తానూరులో..



కుంటాల: పెంచికల్‌పాడ్‌లో..



నర్సాపూర్(జి) బస్టాండ్ వద్ద..



భైంసాలోని ఏపీనగర్‌లో..

22న పీడీఎస్ బియ్యం వేలం

భైంసాటౌన్: అక్రమంగా తరలిస్తూ పట్టణంలో ఇటీవల పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని ఈనెల 22న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 8న లారీలో అక్రమంగా తరలిస్తున్న 360 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడగా, ఈ మేరకు వాటిని సీజ్‌చేసి స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 22న వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు తహసీల్దార్, భైంసా పేరిట రూ.10 వేలు డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

అభ్యంతరాల స్వీకరణ గడువు పెంపు

నిర్మల్‌చైన్‌గేట్: వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి చేపట్టిన నియామకాల దరఖాస్తులపై అభ్యంతరాల స్వీకరణ ఈనెల 24వ తేదీ వరకు పెంచినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 32 ఖాళీల భర్తీ నియామక ప్రక్రియలో భాగంగా, అర్హులైన అభ్యర్థులపై అభ్యంతరాల స్వీకరణకు మొదట 20వ తేదీ వరకు గడువు విధించారు. తాజాగా మరో నాలుగు రోజులు పెంచారు. ఖాళీల భర్తీ ప్రక్రియకు నోడ్ అధికారిగా డాక్టర్ అంకిత్‌రాజ్‌ను నియమించినట్లు తెలిపారు. అభ్యంతరాల స్వీకరణపై సందేహాలు ఉంటే నోడల్ అధికారి మొబైల్ నంబర్ 9494392355 ను సంప్రదించవచ్చని తెలిపారు. అర్హులపై అభ్యంతరాలుంటే నిర్మల్ అధికారిక వెబ్‌సైట్ మెయిల్ ఐడీ recruitment gmcnirmal@gmail. com, వైద్య కళాశాల అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన గూగుల్ ఫారం నింపి తెలుపవచ్చునని పేర్కొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాస్

ఖానాపూర్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ నియమితులయ్యారు. బీజేపీ తెలంగాణ సంఘటన పర్వ్ 2024 ఎన్నికల నియమావళి ఆధారంగా పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నియామకం పూర్తి చేశారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్‌లో బుధవారం బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నర్సాపూర్‌కు చెందిన లక్ష్మణ్ (19) కనకాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా నిర్మల్ నుంచి వస్తున్న కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

నరేందర్‌రెడ్డి గెలుపు బాధ్యత కాంగ్రెస్ శ్రేణులదే

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నిర్మల్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో బుధవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్నారు. ఏడాదిలో 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు గండ్రత్ ఈశ్వర్, అప్పాల గణేశ్, ఎర్రవోతు రాజేందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సమర సింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు నందెడపు చిన్ను, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఎంబడి రాకేశ్, సేవాదళ్ రాష్ట్ర నాయకులు ఎంబడి రాజేశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి , ఎఫ్ఎసీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి అజార్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జునైద్ మెమన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఖానాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు బుధవారం మండలంలోని గోసంపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ యూత్ మండల ప్రధాన కార్యదర్శి బొడికె సంతోష్, నాయకులు కరిపె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'

కడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం కడెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అయన మాట్లాడారు. అసెంబ్లీ ఇన్‌చార్జి అంకం మహేందర్, మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, లక్ష్మణ్, రవీందరెడ్డి, అనిల్, సత్తెన్న, కృష్ణ ఉన్నారు.

భైంసారూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వానల్‌పాడ్, తిమ్మాపూర్, సుంక్లి గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆకాశ్, సాయారెడ్డి, చందర్‌పటేల్, రాంపటేల్, రామారావు, సంజీవ్‌రావు, అశోక్, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజారెడ్డి ఉన్నారు.

కుంటాల: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని మాజీ ఎంపీపీ గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. కుంటాలలో ప్రచారం నిర్వహించారు. రమణారావు, గోవర్ధన్, వంశీ, గజేందర్, రవి, శ్రీరామ్, గజేందర్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో దొంగతనం.. ఇద్దరు మహిళలపై కేసు

ముధోల్: దొంగతనం చేసి బస్సులో పారిపోతున్న ఇద్దరు మహిళలను పట్టుకున్న ఘటన బుధవారం ముధోల్ బస్టాండ్‌లో చోటు చేసుకొంది. ముధోల్ సీఐ మల్లేశ్ వివరాల ప్రకారం.. మండలంలోని అష్ట గ్రామానికి చెందిన సునీత తన ఇద్దరు పిల్లలతో నిజామాబాద్ జిల్లా బోధన్ వెళ్లేందుకు ముధోల్ బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తోంది. తన పిల్లలకు దాహం వేయడంతో వారిని, తాను తెచ్చుకున్న కవర్, సెల్‌ఫోన్, పర్సును అక్కడే ఉంచి బస్టాండ్ బయట ఉన్న దుకాణంలోకి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి బాసర మండల కేంద్రానికి చెందిన షబనా, పద్మ అనే ఇద్దరు మహిళలు సునీత కవర్, సెల్‌ఫోన్, పర్సులోని రూ.వెయ్యిని దొంగలించి భైంసా వైపు వెళ్తున్న బస్సులో కూర్చొన్నారు. సునీత వచ్చి చూసేసరికి పర్సు, సెల్‌ఫోన్ కన్పించలేదు. తోటి ప్రయాణికులు ఆమెకు జరిగిన విషయం చెప్పగా ఓ ప్రయాణికుడి బైక్‌పై బస్సును వెంబడించి పోలీస్‌స్టేషన్ వద్ద ఆపారు. వివరాలు తెలుసుకున్న ఎస్సై సంజీవ్.. మహిళా సిబ్బందితో తనిఖీలు చేపట్టి షబనా, పద్మ నుంచి సునీత ఫోన్, పర్సును స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

కుంభమేళా జలం పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ఉద్యోగి గంగాధర్‌గౌడ్ ఇటీవల కుంభమేళాకు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా త్రిసంగమ పుణ్య జలాన్ని తీసుకొచ్చి బుధవారం నిర్మల్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో తనతో వాకింగ్ చేసే సహచరులకు దాదాపు 200 చిన్న బాటిళ్లలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు లక్ష్మయ్య, అనిల్, శంకర్‌గౌడ్, సిరిసిల్ల కళ్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ధ్యానం చేయాలి

భైంసాటౌన్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం తగ్గించుకునేందుకు నిత్యం ధ్యానం, యోగా చేయాలని టెమ్రిస్ ప్రిన్సిపాల్ జబ్బార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ బందెల నాగేశ్, భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రఫీక్, తానూర్‌కు చెందిన ఎస్జీటీ సయ్యద్ అర్షద్ విద్యార్థులకు పరీక్షలు, ఎగ్జామ్ ఫోబియా, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై వివరించారు. ఇటీవల ఉద్యోగాలు పొందిన పీఈటీ సాగర్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ కళలను ఆదరించాలి

- తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి
- యక్షగాన కళాకారులకు జాతీయ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కళాకారులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రంలో అనాదిగా వస్తున్న చారిత్రక వారసత్వ కళలను పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించాలని, ఆ కళాకారులకు చేయూతనివ్వాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల వేదిక, కావేరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యక్షగానం, చిందు కళాకారులకు జాతీయ పురస్కారాలు మంగళవారం రాత్రి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జానపద సాహిత్య అకాడమీ ఏర్పాటు చేయాలని, అంతరించి పోతున్న కళలను బతికించుకోవాలని, కళాకారులను ప్రజలందరూ కాపాడుకోవాలని, కళాకారుల కుటుంబాలకు చేయూతనివ్వాలని కోరారు. యక్షగానం కళ దాదాపు 2 వేల సంవత్సరాల చరిత్రను కలిగి ఉందన్నారు. పూర్వం సమాజంలో మిక్కిలి ఆదరణ పొందిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా యక్షగానాన్ని నమ్ముకుని ఉన్న కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతున్న కళలను భుజాన వేసుకుని జీవనం సాగిస్తున్న కళాకారులకు గుర్తింపునివ్వాలని కోరారు. జిల్లాకు చెందిన పలువురు యక్షగాన కళాకారులకు జాతీయ పురస్కారాలను అందించి ఘనంగా సన్మానించారు. ప్రముఖ చిందు భాగవతం కళాకారుడు పులింటి లచ్చురాంకు స్వర్ణగండపెండేరం తొడిగి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, అప్పాల కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.రాజేందర్, సాహితీవేత్తలు డాక్టర్ దామెర రాములు, డాక్టర్ కృష్ణంరాజు, కవి చారిత్రక పరిశోధకులు తుమ్మల దేవరావు, బి.వెంకట్, అంబటి నారాయణ, పోలీస్ భీమేష్, కామారపు జగదీశ్వర్, కుమ్మరి నాగారం, పత్తి శివప్రసాద్, శశికుమార్, వెంకటరమణ, కవులు, రచయితలు, యక్షగాన కళాకారులైన పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రం పరిశీలించిన ఆర్డీఓ



కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఆర్డీఓ రత్నకళ్యాణి

నర్సాపూర్(జి): ఈనెల 27న నిర్వహించే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆర్డీఓ రత్నకళ్యాణి పరిశీలించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్, ఇన్‌చార్జి హెచ్ఎం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌టౌన్: నిరుద్యోగుల సమస్యల పరిష్కార సాధనకు తన వంతు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాకో నవోదయ విద్యాలయం, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. నవీన్, మహేందర్, రాములు, నవీన్‌కుమార్, ప్రవీణ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ప్రాజెక్టర్ ద్వారా ఉద్యోగులకు డ్యూటీలో ఉన్నప్పుడు పాటించాల్సిన నిబంధనల గురించి బుధవారం క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి నిధులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి సంస్థ అభివద్ధికి పాటుపడాలని తెలిపారు. అనంతరం ఉద్యోగులతో పాటలు పాడించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూర ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ ఈఈ వెల్దండి అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘ పటిష్టతకు ఆయన పలు సూచనలు చేశారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీకి హైదరాబాద్‌లో సొంత భవనం ఉందన్నారు. పద్మశాలి ఉద్యోగులకు మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తూ పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లాలోనూ నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆ సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకరణాలతో పాఠాలు బోధించాలి

సోన్: ఉపాధ్యాయులు ఉపకరణాలతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని.. తద్వారా అభ్యసన ఫలితాలు సాధించాలని ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్ సూచించారు. బుధవారం మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల సన్నద్ధత కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రాండ్ టెస్ట్-1 మార్కులపై సబ్జెక్టు ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల బోధన, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అంతకుముందు న్యూవెల్మల్, బొప్పారం ప్రాథమిక పాఠశాలల్లో అమలవుతున్న బోధనాభ్యాసం (తొలిమెట్టు)కార్యక్రమాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మణ్, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు వందన, ముత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899